



కల్వకుర్తి సమీపంలో పూర్తి కావస్తున్న ఎన్‌హెచ్ 167కే పనులు

వేగంగా 167కే జాతీయ రహదారి

విస్తరణ పనులు

- నాగర్‌కర్నూలు జిల్లాలో 70 శాతం పూర్తి
- హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు తగ్గనున్న 80 కిలోమీటర్లు

4

కొల్లాపూర్

మునిసిపల్ అభివృద్ధికి రూ.15 కోట్లు

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

నేటి నుంచి రాష్ట్రస్థాయి

నెట్‌బాల్ టోర్నీ

- పాలమూరుకు చేరుకున్న జట్లు
- వర్షం పడితే.. ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు

5

గంటపాటు కుండపోత

- కొత్తకోట, తాడూరు మండలాల్లో భారీ వర్షం



తాడూరు మండలంలోని పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న కాజ్‌వేపై నుంచి పారుతున్న వరద నీరు

4

ఊరించి.. ఉసూరు..!

- స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాతో ఆశావహుల్లో నిరుత్సాహం
- ఇప్పటికే గణేశ్ చవితి, దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భారీగా ఖర్చు
- మొదటి విడత నామినేషన్లపై పెద్దగా కనిపించని ఆసక్తి
- ప్రజాక్షేత్రంలో ప్రచారం ఆపొద్దని నేతల నిర్ణయం



వెల్దండ మండలంలోని నామినేషన్ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మహబూబ్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జారీ చేసిన జీవోను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.. హైకోర్టులోనే వాదనలు వినిపించాలని సుప్రీంకోర్టు పిటిషన్‌ను తిరస్కరించగా.. అప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడం, హైకోర్టు బుధవారం చేపట్టిన విచారణలో ఏదో ఒకటి తేలుతుందని చాలా మంది ఆశించారు. అయితే బుధవారం స్టే ఇవ్వకపోవడం, గురువారం విచారణ చేస్తామని చెప్పడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఇక ఎన్నికలకు అడ్డంకులు తొలగి.. షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తారని అంతా భావించారు. అధికారులు మొదటి విడతలో కేటాయించిన మండలాల్లో నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించి.. అభ్యర్థుల నుంచి స్వీకరించింది. అయితే గురువారం విచారణ సందర్భంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. నెల రోజుల పాటు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచించి.. నాలుగు వారాల తర్వాత ఈ అంశంపై విచారణ చేస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్ర ఎన్నికల సంఘం కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని ప్రకటన విడుదల చేసింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగా, తాజా ఉత్తర్వులను అనుసరించి, షెడ్యూల్ ను మార్చే అవకాశం ఉంటుంది.

ప్రచారపర్వంలో ముందుకే..

స్థానిక సంస్థల ఎన్నికలు అంటే ఊర్లలో పండుగ వాతావరణం ఉంటుంది. ఈ సారి ఎన్నికలు స్థానిక సంస్థల ఆశావహులను ఊరించి.. ఉసూరు అనిపించినట్లుగా మారాయి. ఎలాగూ ఎన్నికలు జరుగుతాయి కాబట్టి

(మిగతా 4వ పేజీలో..)

11 నామినేషన్లు మాత్రమే...

షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో తొలివిడతలో 38 జడ్పీటీసీ, 420 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. హైకోర్టు బుధవారం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఎంపీటీసీ స్థానాలకు 10, జడ్పీటీసీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. పాలమూరు జిల్లాలో రాజాపూర్ మండల కేంద్రం ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థి నామినేషన్ వేయగా, నాగర్‌కర్నూలు జిల్లాలో జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఒక నామినేషన్ వేశారు. నారాయణపేట జిల్లాలో ఎంపీటీసీ స్థానాలకు 5 నామినేషన్లు దాఖలు కాగా.. ధన్వాడలో మూడు, దామరగిద్దలో ఒకటి, నారాయణపేట మండలంలో ఒక నామినేషన్ వేశారు. వనపర్తి జిల్లాలోని పెబ్బేరులో ఎంపీటీసీ స్థానాలకు ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు, గోపాల్‌పేట మండలంలో ఒక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామ ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ వేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు నామినేషన్ల దాఖలును పరిశీలించారు. ఒకవైపు నామినేషన్లు కొనసాగుతుండగానే కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

సీసీఐ కొనుగోళ్లు ఇంకెప్పుడు?

- పక్క రాష్ట్రంలో ప్రారంభమైన కొనుగోళ్లు
- కర్ణాటకకు తరలిస్తున్న వ్యాపారులు



మానవపాడులో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు

5

నడిగడ్డ క్రీడలకు పుట్టినిల్లు

ఎస్‌జీఫ్ పోటీలను ప్రారంభించిన డీఈవో



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న గద్వాల డీఈవో విజయలక్ష్మి

అలంపూర్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డ క్రీడాకారులకు పుట్టినిల్లులాంటిదని, ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారని డీఈవో విజయలక్ష్మి అన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని లింగనవాయి జడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 వాలీబాల్ బాల, బాలికల పోటీలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, ప్రతీ ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. వాలీబాల్ క్రీడల్లో 13 మండలాల నుంచి పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన పోటీలలో బాలురు విభాగంలో విన్నర్‌గా గద్వాల జట్టు, రన్నర్‌గా కేటీదొడ్డి, బాలికల విభాగంలో విన్నర్‌గా ఎర్రవల్లి, రన్నర్‌గా గద్వాల జట్లు నిలిచాయి. విజేతలకు కప్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో అశోక్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రతీ ఏడాది.. ఆలస్యమే

- టెండర్లు పిలిచినా పంపిణీకి నోచుకోని చేప పిల్లలు
- ఎదురు చూస్తున్న మత్స్యకారులు



గద్వాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న చేపపిల్ల పంపిణీ పథకం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం టెండర్ల నిర్వహణను ఆలస్యం చేసింది. గతేడాది కూడా పంపిణీని ఆలస్యం చేయడంతో చేపల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు వేశారు..

జిల్లాలో చేపపిల్లల పంపిణీకి ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ఇద్దరు వేయడంతో టెక్నికల్ బిడ్ ఓపెన్ చేశారు. కానీ ఫైనాన్షియల్ బిడ్‌ను తెరిచారు. బేరం మాత్రమే మిగిలిపోయింది. వారం రోజులుగా అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్, ఓటర్ల జాబితా శిక్షణ వంటి పనుల్లో బిజీ కారణంగా అధికారులకు సమయం కేటాయించలేదు.

జిల్లాలో 7వేల మంది మత్స్యకారులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు 7వేల మంది మత్స్యకారులు ఉన్నారు. ముదిరాజ్‌లు అందరు దాదాపు వారి వృత్తిపైనే ఆధారపడి ఉన్నారు. జిల్లాలో 94మత్స్యకార సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాలో 441 చెరువులు ఉన్నాయి. ఇందులో 40పెద్ద చెరువులు, 375 మీడియం, 26 చిన్న కుంటలు ఉన్నాయి. ఇవే కాకుండా ఎనిమిది రిజర్వాయర్లు కూడా ఉన్నాయి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్‌లు జలకలను సంతరించుకోవడంతో మత్స్యకారులు చేపపిల్లలను ఎప్పుడు పంపిణీ చేస్తారని ఎదురు చూస్తున్నారు.

తూకం రావడం లేదు..

చేపపిల్లల పంపిణీ ప్రతీ ఏడాది ఆలస్యమే అవుతోంది. ప్రతీ ఏడాది 1.69కోట్ల చేప పిల్లల పంపిణీ చేసేవారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం 90లక్షల చేపపిల్లలను మాత్రమే పంపిణీ చేసింది. అవి కూడా ఆలస్యంగా పంపిణీ చేస్తే ఎదగడానికి ఆరు నెలల సమయం పడుతోంది. ఆలోపు చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోయి చేపలు తూకం రాక నష్టం వస్తోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు అనుమతిస్తేనే పంపిణీ



ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తేనే పంపిణీ కార్య క్రమాన్ని ప్రారంభిస్తాం. ప్రతీ ఏటా చేపపిల్లల పంపిణీ జరుగుతోంది. ఈ ఏడాది కూడా పంపిణీ చేస్తాం. టెండర్లు కూడా పిలిచాం.. ఇదదరు టెండర్ వేయడంతో బిడ్ ఓపెన్ చేశాం. త్వరలోనే మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

- షకీలాబాను, జిల్లా మత్స్యశాఖ అధికారి గద్వాల

వేయాలా.. వద్దా!

- మద్యం టెండర్ కోసం ముహూర్తం చూస్తున్న వ్యాపారులు
- 10 రోజులకు వచ్చింది రెండు దరఖాస్తులే
- 18వ తేదీ వరకు గడువు
- చివరి 3 రోజులు పెరుగుతాయంటున్న అధికారులు



వనపర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త మద్యం పాలసీని ప్రకటించింది. గతంలో రెండేళ్లకు సంబంధించి రూ.2 లక్షలు ఉండగా ఈ ఏడాది మూడేళ్లకు రూ. 3లక్షలుగా నిర్ణయించారు. గత నెల 26వ తేదీ నుంచి 2025-27 సంవత్సరానికి సంబంధించి కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సెలవులు వచ్చినా 10 పని దినాలలో దరఖాస్తులు స్వీకరించగా గురువారం వరకు జిల్లాలో ఉన్న 36 మద్యం దుకాణాలకు గాను 2 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఫీజు రూ. 3 లక్షలు పెంచడంతో మద్యం వ్యాపారులు ముందుకు వెళ్లాలా వద్దా అనే ఆలోచనలో పడ్డారు. దీనికి తోడు మంచి ముహూర్తాలు లేకపోవడంతో దరఖాస్తులు సమర్పించేవారు వెనుకంజ వేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు చివరి నాటికి పాత మద్యం దుకాణాల గడువు ముగుస్తోంది. దీంతో రెండు నెలల ముందే టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది.

వనపర్తి జిల్లాలో 36 దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా 36 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో వనపర్తి సర్కిల్ పరిధిలో 16, ఆత్మకూరు 5, కొత్తకోట సర్కిల్ పరిధిలో 15 దుకాణాలు ఉన్నాయి. వీటిలో రిజర్వేషన్ ప్రకారం గౌడ, ఎస్సీ, ఎస్టీలకు డిప్పు ద్వారా దుకాణాలను కేటాయించారు. అందులో వనపర్తి సర్కిల్ పరిధిలోని దుకాణం నెంబరు 5 ఎస్సీ, 11, 12, 13, 16 గౌడలకు, 14 ఎస్టీలకు కేటాయించారు. కొత్తకోట సర్కిల్ పరిధిలో 18, 21 ఎస్సీలకు, ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 32, 34 దుకాణాలను ఎస్సీలకు కేటాయించారు. ఈ దుకాణాలకు సంబంధిత కులస్థులే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మిగతా దుకాణాలకు అందరూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

సిండికేట్‌కే మొగ్గు

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. గతంలో చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యుల పేరిట దరఖాస్తులు వేశారు. దీంతో మహిళలు చాలా మంది పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న 36 దుకాణాల్లో 25 దుకాణాలకు అమ్మకాలు భారీగా ఉండడంతో వాటికి పోటీ ఉండనున్నట్లు తెలుస్తుంది.

ఇంకా 9 రోజుల సమయమే..



గత నెల 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 36 దుకాణాలకు గాను రెండు దరఖాస్తులు వచ్చాయి. ఇంకా 9 రోజుల సమయం ఉంది. కాబట్టి చివర్లో ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

- శ్రీనివాసులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

- స్పిల్ వే ద్వారా నీటి విడుదలను నిలిపివేసిన అధికారులు
- విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, లిఫ్టులకు 72 వేల క్యూసెక్కుల నీరు విడుదల

4

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00



పుష్కరఘాట్‌లో మాక్ డ్రిల్ చేస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు

పుష్కర ఘాట్ వద్ద మాక్ డ్రిల్

అలంపూర్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను రక్షించుకునేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం అలంపూర్ జోగుళాంబ ఆలయ ప్రాంగణంలోని పుష్కరఘాట్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు అలంపూర్ సీఐ రవిబాబు ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో ప్రత్యేక బోట్ల సహాయంతో శిక్షణ ఇచ్చారు. ప్రజలు ప్రకృతి విపత్తులు ఎదురైన సమయాల్లో తమను తాము ప్రాణాలతో ఎలా కాపాడుకోవాలో చూపించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల విన్యాసాలను పట్టణ ప్రజలు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎన్డీఆర్‌ఎఫ్ చీఫ్ దేవేంద్రసింగ్ తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి, ఎంఈఓ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియలో

ఈవీఎంల భద్రత ముఖ్యం : కలెక్టర్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత ముఖ్యమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈవీఎంలను భద్రపర్చిన గోదామును ఆయన తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థలను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేందుకు భద్రతా చర్యలు అత్యంత కీలకమని ఆయన అన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండీ హుస్సేన్, శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరు..!

(3వ పేజీ తరువాయి)

ఇప్పుడే తమ బలాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో ఆశావహులు ఇప్పటికే భారీగా ఖర్చు చేశారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఇవ్వడం, అన్నదానాలు చేయడం, చందాలు రాయగా.. దేవి నవరాత్రి ఉత్సవాల్లోనూ ఉత్సాహంగా పాల్గొని తమ భాగస్వామ్యాన్ని చూపించారు. అలాగే దసరా పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. తాజా కోర్టు ఉత్తర్వులతో వారి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది.

కొందరు అభ్యర్థులైతే ఏక గ్రీవాల కోసం రూ. 25 లక్షల నుంచి రూ. 75లక్షల వరకు కూడా ఇస్తామని నవాబుపేట మండలంలో ప్రకటించారు. ఇప్పుడు వారంతా ఏం చేయాలని తలలు పట్టుకుంటున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే పార్టీలు మాత్రం ప్రచారపర్వంలో ముందుకు సాగాల నే సూచనలు ఇస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డుల పేరు తో బీఆర్ఎస్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తుండగా, దాన్ని అలాగే కొనసాగించాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తమ కార్యకర్తల కు సూచిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల విష యంలో బీజేపీని, బీఆర్ఎస్‌ను ఎండగట్టాలని, వారి చీకటి ఒప్పం దంతోనే రిజర్వేషన్ల విషయంలో ఆటంకాలు వస్తున్నాయని బలం గా క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని ప్రణాళికలు చేస్తున్నాయి.

అలాగే రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ క్యాంపెయిన్‌ను కొనసాగించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి ఎన్నికల ప్రక్రియ వాయిదా పడగా, తర్వాత కూడా కోర్టు రిజర్వేష న్లను రద్దు చేసేలా ఒకవేళ తీర్పు వెల్లడిస్తే పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. మిగతా పార్టీలు కూడా దాదాపు ఇదే విధానాన్ని అనుసరించే అవ కాశం ఉంది. ఒకవేళ రిజర్వేషన్లకు ఆమోదం లభిస్తే ప్రస్తుత సరళి ని కొనసాగించనున్నాయి.

ప్రభుత్వం హామీ నెరవేర్చాలి

» 98 జీవో నిర్వాసితుల డిమాండ్



జటప్రోలు మాసుంబాబా దర్గాలో పూజలు చేస్తున్న నిర్వాసితులు

పెంట్లవెల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో 98 జీవో నిర్వాసితులు గురువారం మాసుంబాబా దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 98 జీవో నిర్వాసిత సంఘం జిల్లా నాయకుడు షబ్బీర్ మాట్లాడుతూ గతంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ప్రారంభానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 98 జీవో నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు త్వరగా పరిష్కరించాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాసుంబాబా దర్గాను దర్శించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత సంఘం నాయకులు చిన్నారెడ్డి, బాలు, మోత్కూర్ నాగిరెడ్డి, బాలయ్య, ఎస్కే ఖాజా తదితరులు ఉన్నారు.

35 ఏళ్ల కల సాకారమయ్యేనా?

» ఒక్క వర్షం కురిస్తే దండం చెరువు అలుగు పారడం ఖాయం

» 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్న చెరువు



రెండు ఫీట్ల ఎత్తుకు నీరొస్తే అలుగు పారేందుకు సిద్ధంగా ఉన్న దండం చెరువు

కోస్గి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దండం చెరువు.. ఇది సంపూర్ణంగా నిండితే దాదాపు 800 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం మరో 30 మిల్లీ మీటర్ల వర్షం పడితే అలుగుపారే అవకాశం లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో 35 ఏళ్ల కోస్గి ప్రజల కల సాకారం కానుంది. కోస్గి మండలం ఈజీపూర్ గ్రామ శివారులో ఈ దండం చెరువు ఉంది. కోస్గి రైతులకు సస్యశ్యామలంగా సాగు నీరందించే వరప్రదాయిని. ఈ చెరువు ఈజీపూర్ శివారు సర్వేనెంబరు 4లో 25 ఎకరాల శికం, తొగాపూర్ శివారులో 220 సర్వేనెంబర్‌లో 31 ఎకరాల 35 గుంటల శికం భూములు ఉన్నాయి. మొత్తం సుమారు 57 ఎకరాల శికం భూమి ఉండగా, ఈ చెరువు 286 ఎకరాల ఎఫ్‌టీఎల్ నీరు నిండుతుంది. ఈ చెరువు కింద కోస్గి, మాసాయిపల్లి, తొగాపూర్‌కు చెందిన సుమారు 800 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. అయితే, ఈ చెరువు 1989లో పూర్తిగా నిండింది. అప్పటినుంచి నేటి వరకు చెరువు నిండలేదు. అందుకు కారణం చెరువు పాటు కాలువలు పూడుకుపోవడమే కారణం. కాగా, ఈ ఏడాది ఇరిగేషన్ అధికారులు పోలేపల్లి చెరువు నుంచి వచ్చే వరద కాలువలో ముళ్ల పొదలు తొలగించారు. అదేవిధంగా, దాదాపూర్ చెరువు నుంచి వచ్చే వరద కాలువను కూడా కాడ నిధులు రూ.66 లక్షలతో మరమ్మతు చేపట్టారు. అయితే, పెద్ద ఎత్తున వర్షం కురిసినప్పుడు ఈ రెండు చెరువులు అలుగు పారినా నీరంతా నేరుగా దండం చెరువుకు వస్తుంది. దీంతో ప్రస్తుతం రెండు ఫీట్లు ఎత్తుకు నీరు వస్తే చెరువు అలుగు పారడం ఖాయం.

ప్రస్తుతం 115 ఎంసీఎఫ్‌టీ (మెట్రిక్ ఫీట్)నీరు నిల్వ ఉండగా, 30 మిల్లీ మీటర్ల వర్షం పడితే ఇక ఈ చెరువు అలుగు పారడం ఖాయమని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

వరద తగ్గింది

దాదాపూర్ పోలేపల్లి చెరువు నుంచి వచ్చే వరద తగ్గింది. గత వారం క్రితం పడ్డ వర్షానికి వచ్చిన వరదప్రకారం లెక్కతీసుకుంటే సుమారు ఇంక 30 మిల్లీ మీటర్ల వర్షం కురిస్తే వచ్చే వరదతో దండం చెరువు నిండి అలుగు పారుతుంది.

- పవన్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ

ఆర్థో సర్జరీల్లో అత్యాధునిక పద్ధతులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కే.జే రెడ్డి

» 12న రాష్ట్రస్థాయి ఆర్థోపెడిక్ అవగాహన సదస్సు

» ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎండీ డాక్టర్ కే.జే రెడ్డి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఆర్థోపెడిక్ సర్జరీల్లో అ త్యాధునిక పద్ధతులు, పరికరాలతో వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎండీ, నీ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కే.జే రెడ్డి అన్నారు. గురువారం ఎస్వీఎస్ ఆసు పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలోని ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి ఆర్థోపెడిక్ సర్జన్ల అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం 7 గంటలకు పట్టణంలోని శ్రీకృష్ణ టెంపుల్ కమాన్ నుంచి ఎస్వీఎస్ వరకు వాకతాన్ నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది ఆర్థరైటిక్ దినోత్సవాన్ని పు రస్కరించుకొని కళాశాలలో నిర్వహించే సదస్సు లో అత్యాధునిక సర్జరీలు, ఆధునిక పరికరాలతో సర్జరీలు చేసే విధానాలపై లైవ్ సర్జరీలు చేస్తు న్నామన్నారు. అంతేకాకుండా ఇది వరకు ఆర్థరైటి స్‌తో పాటు ఆర్థోపెడిక్‌కు సంబంధించి అన్ని రకాల సర్జరీలు చేసిన తర్వాత ఇన్‌ఫెక్షన్ వల్ల ఫేయి ల్ అయిన సర్జరీలను, నీరీప్లేస్‌మెంట్ అయిన తర్వాత కూడా ఫేయిల్ అయిన సర్జరీలు, ఆటలు, చిన్నపిల్లలు, నడుముకు సంబంధించిన సర్జరీలను ఎలా సరిదిద్దాలనే అంశాలపై లైవ్ సర్జరీలు చేసి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఈ సదస్సుకు రాష్ట్రస్థాయిలో 400 నుంచి 450 మంది వరకు ఆర్థోపెడిక్ సర్జన్లు, ప్రత్యేక అనుభవం ఉన్న 70 మంది ఫ్యాకల్టీ పాల్గొంటారని వెల్లడించారు.

ఆర్థోపెడిక్ సర్జరీలకు సంబంధించిన అన్ని రకాల వైద్య చికిత్సలు ఆరోగ్యశ్రీ, హెల్త్ స్కీంలు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్వీఎస్ ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

కొల్లాపూర్ మునిసిపల్ అభివృద్ధికి రూ. 15 కోట్లు

» మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

కొల్లాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ బడ్జెట్ నుంచి నిధులు మంజూరు అయ్యాయని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలోని బండాయగుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం పెండింగ్ పనులకు రూ.3 కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయని, అదే విధంగా కొల్లాపూర్ రాజావీధిలో కోట బురుజు ప్రాంతంలో మునిసిపల్ కార్యాలయం భవన నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరయ్యాయని, పట్టణంలోని 5 వార్డు పీతురు కుంట సమీపంలో హిందూ శ్మశాన వాటికలో వసతుల కోసం రూ. 2 కోట్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 20వ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఒక్కో వార్డుకు రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ. 5 కోట్ల రూపాయలు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. కొల్లాపూర్ పట్టణంలోని ఐదో వార్డులో శివాలయం కాలనీ సమీపంలో వాటర్ సప్లయ్ ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం కోసం రూ. కోటి 50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండీడ్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై నుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన మహమ్మదాబాద్ మండలంలోని ముకర్లబాద్ రామ్‌రెడ్డి బావి సమీపంలో మంగళ వారం జరిగింది. గోవిందుపల్లి గ్రామానికి చెందిన కమలయ్య ద్విచక్ర వాహనంపై మహబూబ్ నగర్‌కు వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో కిందపడి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేగంగా 167కే జాతీయ రహదారి విస్తరణ పనులు

» నాగర్‌కర్నూలు జిల్లాలో 70 శాతం పూర్తి

» హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు తగ్గనున్న 80 కిలోమీటర్లు

» నల్లమలలో పర్యాటక రంగానికి పురోభివృద్ధి



కొల్లాపూర్ శివారులో సింగోటం చౌరస్తా నుంచి కృష్ణానది వంతెన సమీపానికి చేరుకునేందుకు నిర్మిస్తున్న బ్రిడ్జి

నాగర్‌కర్నూల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల పనులు వేగవంతమయ్యాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యక్ష పర్యవేక్షణ సూక్ష్మంగా ఉండటంతో కల్వకుర్తి నియోజకవర్గం కొట్ర గేటు నుంచి రహదారి పనులు వేగవంతమయ్యాయి. దీంతో కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన ఉమామహేశ్వర క్షేత్రం, సోమశిలలోని సోమేశ్వరాలయానికి భక్తుల తాకిడి అధికమైంది. ఈ క్రమంలో ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్‌ల నుంచి భక్తులు, పర్యాటకుల సంఖ్య అధికం కావడంతో 167కే రహదారిపై వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ శ్రీశైలం, నాగర్‌కర్నూల్ మీదుగా దైవ దర్శనం, పర్యాటక ప్రాంతాలను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా పెరగగా గడిచిన ఏడాదిలో హైదరాబాద్ నుంచి వయా కల్వాల మీదుగా శ్రీశైలం, సోమశిలకు వచ్చి వెళ్లే వాహనాల సంఖ్య దాదాపు 19 లక్షల 513కు చేరింది. హైదరాబాద్ నుంచి తిరుపత్తి వెళ్లాలనుకునే భక్తులు జడ్చర్ల, కర్నూల్, నంద్యాల, కడప మీదుగా అక్కడికి ప్రయాణించాల్సిందే. అయితే 167కే జాతీయ రహదారి పనులు పూర్తై సోమశిల సిద్ధేశ్వరం వంతెన త్వరితగతిన పూర్తైతే హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాలనుకునే భక్తులకు 80 కిలో మీటర్ల దూరభారం తగ్గుతుంది. అదేవిధంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ నుంచి వ్యాపారపరమైన సంబంధాలు కూడా అభివృద్ధి చెందుతాయి.

70 శాతం దాకా పనులు పూర్తి

కల్వకుర్తి నియోజకవర్గం కొట్ర గేటు నుంచి కొల్లాపూర్, సోమశిల వరకు 79.3 కిలో మీటర్ల నేషనల్ హైవేను నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం రూ. 545 కోట్లు మంజూరు చేసింది. అందులో రూ. 401 కోట్లు రోడ్ల నిర్మాణానికి, భూసేకరణకు రూ. 144 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. 167కే జాతీయ రహదారి నిర్మాణానికి ఇంకా 29 హెక్టార్ల భూసేకరణ మిగిలి ఉంది. 167కే జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో 79.3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉండగా 53 కిలో మీటర్ల వరకే రోడ్డు నిర్మాణ పనులు కొలిక్కి వచ్చాయి. రెండు హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా సుద్దకల్ వద్ద పనులు పూర్తి కాగా తాడూరు, గగ్గలపల్లి మధ్య పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లలో హైలెవల్ బ్రిడ్జిల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

శ్రీశైలానికి తగ్గిన వరద

» స్పిల్ వే ద్వారా నీటి విడుదలను నిలిపివేసిన ప్రాజెక్టు అధికారులు

» విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, లిఫ్టులకు 72 వేల క్యూసెక్కులు విడుదల

» ప్రాజెక్టు సైట్ వద్ద 97 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

మహబూబ్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. ఈ నేపథ్యంలో గురువారం ప్రాజెక్టు అధికారులు స్పిల్ వే ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. అయితే విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా 72 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు సైట్ వద్ద 97,834 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ఇక జూరాలకు 84 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 81 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్రకు 7 వేల క్యూసెక్కులు వస్తుండగా కేవలం కాలువల ద్వారా 10 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు నమోదవుతుండటంతో మళ్లీ ప్రాజెక్టుల వరద పెరిగే అవకాశం ఉంది.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

» పట్టణంలో సర్వే చేసిన ఏఎస్పీ వెంకటేశ్వర్లు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో నాగర్‌కర్నూల్ టౌన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ఎక్కడెక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు నాగర్‌కర్నూల్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్‌లో పురోగతి సాధించడానికి సిగ్నల్ ఏర్పాటు గురించి సర్వే చేసి జిల్లాలో కొన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసే ఏరియాలను గుర్తించారు. నాగర్‌కర్నూల్ సీఐ అశోక్‌రెడ్డి, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కల్యాణ్‌లతో కలిసి అడిషనల్ ఎస్పీ నేముల వెంకటేశ్వర్లు శ్రీపురం రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్, బస్టాండ్, నాగనూల్, మరికొన్ని ప్రాంతాలను గుర్తించారు.



ట్రాఫిక్ సిగ్నల్స్ ఏరియాను గుర్తిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు



భూత్పూర్ మండలంలోని పోతులమడుగు వాగు మధ్యలో నీట మునిగిన ఫాంహౌజ్



నవాబ్‌పేట మండలం రుద్రారంలో ప్రవహిస్తున్న వరద



రుద్రారంలోని ఓ ఇంటి ఆవరణలో నిలిచిన నీరు

గంటపాటు కుండపోత

» పాలమూరులో దంచికొట్టిన వాన

» లోతట్టు కాలనీలు జలమయం

» నవాబ్‌పేటలో పలు ఇళ్లలోకి నీరు

» కొత్తకోట, తాడూరు మండలాల్లోనూ వర్షం

మహబూబ్‌నగర్/ భూత్పూర్/ నారాయణపేట/ కొత్తకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. పట్టణంలో బుధవారం 4 సెంటీమీటర్ల వర్షం కురవగా, గురువారం సాయంత్రం కూడా గంట పాటు వాన దంచికొట్టింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. లోతట్టు కాలనీలను వరద ముంచెత్తింది. 4 సెంటీమీటర్ల వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. బస్టాండ్ ఆవరణలోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. లక్ష్మీనగర్ కాలనీ, రామయ్యబౌళి, టీకేరెడ్డికాలనీలకు వరద కష్టాలు తప్పలేదు. నవాబ్‌పేట మండలంలోనూ 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలంలోని కూచూరు, యన్మన్‌గండ్ల, రుద్రారం, నవాబ్‌పేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. పదేళ్లలో ఎన్నడూ కురవనంతగా వర్షం కురడంతో రుద్రారం, దొడ్డిపల్లి, కూచూరు గ్రామాల్లోని లోతట్టుకాలనీల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. యన్మన్‌గండ్ల శివారులోని బొడ్లకుంటకు గండిపడింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో 4, దేవరకద్రలో 3.7, మూసాపేటలో 2.8, సీసీ కుంటలో 2.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. భూత్పూర్ మండలంలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. 57.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. పోతులమడుగు వాగు, మెగుళ్ల చెరువు, ఈరన్న చెరువు, మద్దికాన్ చెరువులు నిండాయి. ఒక్కో చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా వరి సాగవుతుందని స్థానికులు తెలిపారు.

● వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని బస్టాండ్ ఆవరణ వర్షపు నీటితో వాగును తలపిస్తోంది.



కొత్తకోట బస్టాండ్‌కు తరలి వస్తున్న వర్షం నీరు

డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రహదారులు జలమయం అయ్యాయి. పెద్దమందడి మండలంలో 20.25 మి.మీ. వర్షపాతం నమోదయింది.

● నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని పాపగల్, సిర్సవాడ, ఐతోల్, గోవిందాయపల్లి, భలాన్‌పల్లి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోలెవల్ కాజ్‌వేల మీదుగా వరద పారడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఐతోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు చేరింది. దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే సిర్సవాడ నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ తదితర మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోడేరు మండలంలో 32.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ మండలంలో 21.3, కల్వకుర్తిలో 14.0, తిమ్మాజిపేటలో 12.3, బల్మూరులో 11.3, పెద్దకొత్తపల్లిలో 11.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.



పాల్మూరు, గుట్టలపల్లి గ్రామాల మధ్య వరదనీరు



పిడుగుపాటుతో మృతి చెందిన కందూరు పద్మ

పిడుగు పాటుకు మహిళ మృతి

పిడుగు పాటుతో ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట జిల్లా కేంద్రం శివారులోని తమ పత్తి పొలంలో పత్తి ఏరుతుండగా గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఓ చెట్టు కిందకు వెళ్లిన కందూరు పద్మ (38) పై ఒక్కసారిగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి కొంద దూరంలో ఉన్న కూలీలు విషయాన్ని బాధిత కుటుంబీకులకు చేరవేశారు. మృతురాలికి భర్త మల్లేష్‌తో పాటు ఓ కూతురు, ఓ కుమారుడు ఉన్నారు. జిల్లాలోని మక్తల్ మండలంలో 44.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 22.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

పోతిరెడ్డి చెరువు అలుగులో గల్లంతైన భార్యాభర్తలు

జడ్చర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని కిష్టారం, అంబటాపూర్ గ్రామాల మధ్యన ఉన్న పోతిరెడ్డి చెరువు అలుగులో గురువారం భార్యాభర్తలు గల్లంతయ్యారు. ఇటీవల రోజూ కురిసిన వర్షాలతో పోతిరెడ్డి చెరువులోకి వర్షం నీరు చేరడంతో మూడు సంవత్సరాల అనంతరం చెరువు అలుగు పారింది. చెరువు అలుగు పారడంతో కిష్టారం, అంబటాపురం గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంబటాపూర్ గ్రామానికి చెందిన దంపతులు తాసెం బాలయ్య (70), తాసెం రాములమ్మ(65) గురువారం ఉదయం అంబటాపూర్ గ్రామం నుంచి కిష్టారం గ్రామానికి వచ్చారు. వారు సాయంత్రం తమ స్వగ్రామానికి మరో వ్యక్తితో కలిసి బయలుదేరారు. గ్రామ సమీపంలోని పోతిరెడ్డిచెరువు అలుగునీటిని దాటుతుండగా భార్యాభర్తలు ఇద్దరూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరితో పాటు జిల్లా కేంద్రంలోని రెస్క్యూ బృందంతో కలిసి గల్లంతైన వారి కోసం గాలింపు చేపడుతున్నారు.



తాసెం బాలయ్య (ఫైల్)



తాసెం రాములమ్మ (ఫైల్)

క్రైం కార్నర్

విషాదం మిగిల్చిన కొత్తింటి నిర్మాణం

- క్యూరింగ్ కోసం మోటార్ ఆన్ చేస్తుండగా షాక్ తగిలి వివాహిత మృతి


నింగమ్మ (ఫైల్)

ఊట్కూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణ పనులకు వాటర్ క్యూరింగ్ చేయడానికి మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపొర్ల గ్రామానికి చెందిన కుర్వ అశోక్, భార్య నింగమ్మ (35) పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పనులను ప్రారంభించి బేస్మెంట్ వరకు పూర్తి చేయగా, బుధవారం వాటర్ క్యూరింగ్ చేయడానికి నింగమ్మ మోటార్‌ను ఆన్ చేయడంతో ఒక్కసారిగా షాక్ తగిలి పడిపోయింది. గ్రామస్థులు ఆమెను పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. భర్త అశోక్ రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం నింగమ్మ మృతదేహాన్ని నారాయణపేట ఆసుపత్రికి పోలీసులు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చిన సంతోషంలో ఇంటి పనులు చేపట్టగా, ఇంతలోనే భార్య మృతి చెందడంతో భర్తతో పాటు ముగ్గురు పిల్లలు బోరున విలపించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పరు

- చికిత్స పొందుతూ ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

రాజోలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి గ్రామానికి చెందిన వహీద్, షైబు జాతరలో మిఠాయి దుకాణాల వ్యాపారం చేసేవారు. వారిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై రాజోలి నుంచి సుంకేసుల డ్యాం మీదుగా కర్నూలుకు వెళుతుండగా, కర్నూలు జిల్లా ఎదురూరు శివారులోని బ్రిడ్జి వద్ద బుధవారం మధ్యాహ్నం ఎదురుగా ఇసుక టిప్పర్ వచ్చి ఢీకొన్నది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వహీదు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. షైబు (38) గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామానికి చెందిన కంకలి రేణయ్య(48) హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. గత నెల 29న రేణయ్య, కుమారుడు శివశంకర్ గొర్రెలకు మందులు తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై పెబ్బేరుకు బయలుదేరారు. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి అకస్మాత్తుగా ఆపడంతో వెనుకాల వస్తున్న ద్విచక్ర వాహనం బస్సును ఢీకొట్టింది. రేణయ్య ముఖానికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య ఆశమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



మహబూబ్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న రాత్రి 11 గంటలకు మహబూబ్‌నగర్ రూరల్ మండలం చౌదర్‌పల్లి స్టేజి వద్ద గుర్తు తెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతన్ని జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడు టీషర్ట్ ధరించి ఉండగా, టీషర్టుపై నీమ్ అని ఇంగ్లిష్‌లో రాసి ఉంది. నీలి రంగు డబ్బాల లుంగీ ధరించి ఉన్నాడు. ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ విజయ్ కోరారు.

కారు బోల్తా పడి నలుగురికి గాయాలు

మానవపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని బోరవెల్లి స్టేజీ సమీపంలోని సాల్ట్ దాబా వద్ద గురువారం తెల్లవారుజామున కారు బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తుండగా బోరవెల్లి స్టేజీ వద్ద కారు బోల్తా పడటంతో అందులో ఉన్న అఖిల్‌రెడ్డి, తేజశ్విని, మాధవిలత, శ్రీకాంత్‌రెడ్డికి గాయాలయ్యాయి. 108లో ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు అందరూ ప్రొద్దుటూరుకు చెందినవారిగా గుర్తించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళలు, ఓ యువకుడి అదృశ్యం


శివకుమార్

పెబ్బేరు/ కల్వకుర్తి/ తెలకపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ముగ్గురు మహిళలు, ఓ యువకుడు అదృశ్యమయ్యారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని తోమాలపల్లికి చెందిన పద్మమ్మ పెబ్బేరులో ఉన్న కూతురుని చూసివస్తానని బుధవారం ఉదయం కోడలికి చెప్పి వెళ్లింది. అటు కూతురి ఇంటికి, ఇటు సొంత గ్రామానికి చేరుకోలేదు. గురువారం కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన యువకుడు రేపాని శివ కుమార్ ఈనెల 6న మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి వెళ్లాడు. గురువారం వరకు తిరిగి రాలేదు. దీంతో తండ్రి అంజనేయులు, చిన్న కుమారుడు శివకుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన గుండురు లక్ష్మమ్మ ఈనెల 5న ఇంటి నుంచి హైదరాబాద్ వెళ్లడానికి ఆటోలో కల్వ కుర్తికి బయలుదేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త మల్లయ్య గు రువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తెలకపల్లి మండలంలోని కమ్మారెడ్డిపల్లికి చెందిన భావండ్లపల్లి సువర్ణ మంగళవారం రాత్రి భర్త అంజనేయులుతో గొడవపడింది. బుధవారం పని ఉందని బయటికి వెళ్లింది. తిరిగి రాకపోయేసరికి గురువారం కుమారుడు భావండ్లపల్లి చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

ఇసుక టిప్పరు, లారీలు పట్టివేత

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని అలంపూరు చౌరస్తాలో గురువారం పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, ఖాదర్ తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న టిప్పరును పట్టుకున్నారు. అందులో ఇసుక ఉండటంతో డ్రైవర్ చిన్నకౌలుట్లను విచారించారు. అనుమతి లేకుండా కర్నూలు నుంచి అలంపూరు వైపు రవాణా చేస్తున్నట్లు తేలడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

మానవపాడు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున మానవపాడు స్టేజీ సమీపంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఏపీలోని తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా లారీలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. లారీలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీసీఐ కొనుగోళ్లు ఇంకెప్పుడు?

- వారంలో రూ.2వేలు పడిపోయిన ధర
- పక్క రాష్ట్రంలో మొదలైన కొనుగోళ్లు
- కర్ణాటక తరలిస్తున్న వ్యాపారులు
- గద్వాల జిల్లాలో 1.5లక్షల ఎకరాలకుపైగా పత్తిసాగు


అలంపూర్‌లో చేతికొచ్చిన పత్తిని పొలం వద్దే ఆరబోస్తున్న రైతు ఖుషాన్‌బీ

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది సుమారు 1.30లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ సారి 1.50లక్షల ఎకరాలకు చేరుకుంది. ఇందుకు కారణం గతేడాది రైతులు లాభాలు గడించడమే. ఎన్నడూ లేని విధంగా రైతులు మే నెల చివరి వారం నుంచే సాగుకు మొగ్గు చూపారు. వెరసి కురుస్తున్న వర్షాలకు పత్తి ఎదుగుదల లోపించడమేగాక, పూత రాలిపోతూ అక్కడక్కడ కాసిన కాయలు కూడా మురిగిపోయాయి. దీనికి తోడు పలు తెగుళ్లతో పాటు ఎర్రనల్లి దాడి చేసింది. వెరసి పత్తి నాణ్యత తగ్గింది. దీంతో వ్యాపారులు తమదైన శైలిలో క్వింటాల్ పత్తికి రూ.2వేల మేర తగ్గించేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది పత్తికి రూ.400 పెంచుతూ కేంద్రప్రభుత్వం రూ.8110 మద్దతు ధర నిర్ణయించింది.

దళారులకు అమ్ముకుంటున్న రైతులు

ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి గత నెలలోనే ఇంటికి చేరాయి. కేంద్రం నిర్ణయించిన ధరపైనే రైతులు ఆశలు పెట్టుకుని సీసీఐ కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో అధికారులు ఇంకా సాగతీత ధోరణిలోనే ఉన్నారు. ఇప్పటికే రెండవ కోత మొదలైన కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో రైతులు పెట్టుబడులకోసం దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బహిరంగ మార్కెట్లో దళారులు ప్రస్తుతం పత్తి ధర కేవలం రూ.4,500 నుంచి రూ.6వేల దాక మాత్రమే కొంటున్నారు. రైతుల నుంచి సేకరించిన పత్తిని వందలాది లారీల్లో ఏపీ, కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇలా సరుకును రాష్ట్రం దాటిస్తున్న వ్యాపారులు స్థానిక మార్కెట్లకు సెస్ చెల్లించడం లేదు. దీంతో జిల్లాలో పలు చోట్ల మార్కెటింగ్ అధికారులు తనిఖీలు కట్టుదిట్టం చేశారు. అయినా వ్యాపారులు, దళారులు రాత్రి వేళ తరలించి అధికారులకు బురిడి కొడుతున్నారు.

అప్పులు మిగిలాయి

జూన్ మొదటివారం నుంచే రైతులు పత్తి సాగు మొదలు పెట్టారు. గ్రామాల్లో మొదటి కోతలు పూర్తి చేసుకుని రెండో కోత మొదలు పెట్టారు. దళారులకు అమ్ముకోలేక సీసీఐ కోసం ఎదురు చూస్తున్నారు. ఏపీలో కొనుగోలు మొదలయ్యాయి. పెట్టుబడులకు అప్పులు తెచ్చుకోలేక, చేసిన అప్పులు తీర్చేదారి లేక ఎంతకో అంతకు అమ్మి నష్టపోతున్నారు.

\- జీకే ఈదన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

తక్కువ ధరకే అమ్ముకున్నా..



రెండు ఎకరాలలో పత్తి సాగు చేశాను. ముసురు వర్షాలకు పంట దెబ్బతింది. ఎకరాకు రెండు క్వింటాళ్లే వచ్చింది. సీసీఐ కొనుగోలు కోసం ఎదురు చూసి, కూలీలు చెల్లించేందుకుగాను దళారులకు రూ.5,800 అమ్ముకోవాల్సి వచ్చింది.

\- కృపేందర్‌నాయుడు, పత్తి రైతు, చెన్నిపాడు

నేటి నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ


వర్షంతో చిత్తడిగా మారిన స్టేడియం


మహబూబ్‌నగర్ చేరిన జగిత్యాల జట్టు

- మహబూబ్‌నగర్ చేరుకున్న పలు జిల్లాల జట్లు
- వర్షం పడితే.. ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో ఏర్పాట్లు చేయగా, వర్షం కారణంగా ఏర్పాట్లు తాత్కాలికంగా నిలిపివేశారు. ఇండోర్‌స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నారాయణపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, జగిత్యాల జట్లు చేరుకున్నాయి. ట్రెడిషనల్, ఫస్ట్-5, మిక్స్‌డ్ మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయి. నాకౌట్ పద్ధతిలో డే నైట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోటీలను అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు, 100పైగా కోచ్ మేనేజర్లు, సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జట్టు ఇండోర్ స్టేడియంలో ముమ్మర సాధన చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

మహబూబ్‌నగర్ జట్టు వివరాలు..

బాలికల జట్టులో శమిత, లాస్య, వైష్ణవి, సరస్వతి, మణి దీపిక, సాయిప్రియ, చైత్ర, మనుశ్రీ, పూజ, సింధూజ, మమత, అనురాధ, కోచ్ అక్రమ్‌హుస్సేని మేనేజర్ షేక్‌యాస్మిన్. బాలుర జట్టులో అబ్దుల్లా, రఘు, వంశీగౌడ్, శ్రీనివాసులు, అప్నాన్, అభినవ్‌రుద్ర, వెంకటేశ్, జూనెద్, వివేక్, సాయతేజచ తిరుసుర్‌నాయక్, కోచ్, అబ్దుల్‌షరీఫ్, మేనేజర్ సిద్ధార్థ ఉన్నారు.

రికార్డు స్థాయిలో కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ఆశించిన మేర ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద వస్తున్న కారణంగా 12 యూనిట్లను ప్రారంభించి విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 4.571 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 398.286 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.243 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటి వరకు 385.810 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. వరద ఇదే మాదిరిగానే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తిని చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారం

- మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి మాజీ ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలలో నమ్మకం కోల్పోయిందని, అందుకే ప్రజలందరూ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని తెలిపారు. బీజేపీ నుంచి ఎంపీటీసీ మాజీ సభ్యుడు సబావత్ గోపాల్, కే.గోపాల్, పాండు, రాహుల్, జేమ్లా, నాయక్, పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వర్, గీతాపాండు, గోపాల్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాములు, చిన్న హన్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

పూడ్చిన మృతదేహం వెలికితీత

- మృతిపై అనుమానం ఉన్నదని రెండు నెలల తర్వాత సోదరుడి ఫిర్యాదు
- పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు


పానగంటి సంతోష్ (ఫైల్)


మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య బృందం

భూత్పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : తమ్ముడి మృతిపై అనుమానం ఉందని, మాకు న్యాయం కావాలంటూ అన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెండు నెలల క్రితం పూడ్చి పెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్ సమక్షంలో వైద్య బృందం పోస్టుమార్టం చేశారు. ఈ ఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పెట గ్రామానికి చెందిన పానగంటి సంతోష్(30) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తు న్నాడు. సంతోష్ భార్య కొన్ని నెలల క్రితం వదిలేసి వెళ్లింది. వీరికి పదేళ్ల బాలుడు ఉన్నాడు. కుమారుడితోపాటుగా తల్లి బుగ్గమ్మతో కలిసి సంతోష్ జీవిస్తున్నాడు. ఈ తరుణంలో జూలై 29వ తేదీన అదే గ్రామానికి చెందిన వడ్డేయాదయ్య అనే వ్యక్తి రాజేశ్వర్‌రెడ్డి కూలీకి పిలుస్తున్నాడని చెప్పి సంతోష్‌ను తీసుకెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం సంతోష్‌కు మూర్ఛ వచ్చి కింద పడిపోయాడని సంతోష్ అన్న ఆంజనేయులుకు వడ్డేయాదయ్య ఫోన్ చేసి చెప్పాడు. ఆంజనేయులు అందుబాటులో లేకపోవడంతో తన రెండవ తమ్ముడైన శ్రీనుకు తమ్ముడు కింద పడ్డాడని ఇంటి వెళ్లి చూడమని చెప్పాడు. ఇంతలోనే సంతోష్ చనిపోయినట్లుగా శ్రీనుకు తెలిసింది. అయితే మరుసటి రోజు మృతదేహాన్ని వారి సొంత పొలంలో పూడ్చి పెట్టారు. అయితే మా తమ్ముడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, అన్న శ్రీనివాసులు సెప్టెంబరు 27వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం స్థానిక తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీసి జిల్లా వైద్య బృందం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

నిషేధించిన సిరప్‌లు వాడొద్దు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రజలు పిల్లలకు సంబంధించిన మూడు రకాల సిరప్‌లు ప్రభుత్వం నిషేధించిందని, వాటిని వాడొద్దని ఔషధ నియంత్రణ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకుడు దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్డ్రిప్(బ్యాచ్ నంబర్ 13 ఎంఎస్ శ్రేశన్ ఫార్మ, తమిళనాడు), రెస్పోఫ్రెష్ టీఆర్, రిలైఫ్ సిరప్ వినియోగించవద్దని పేర్కొన్నారు. ఈ మూడు రకాల సిరప్‌లు దుకాణాలు, డిస్ట్రిబ్యూటర్లు, ఆసుపత్రులలో ఉంటే విక్రయించవద్దని, మిగిలినవి ఉంటే తమ కార్యాలయంలో అప్పగించాలని సూచించారు.

మోటారు వైర్లు సరిచేస్తుండగా..

- విద్యుత్‌షాక్‌తో యువ రైతు మృతి


మృతి చెందిన భరత్ (ఫైల్)

తాడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలంలో విద్యుత్ మోటారు వైర్లను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ యువ రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు భరత్ (32) గురువారం సాయంత్రం తన పొలంలో విద్యుత్ మోటారుకు సంబంధించిన వైర్లను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. వైర్లు సరిచేస్తున్న క్రమంలో భరత్ కాళ్ల కింద నీళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఏడు నెలలుగా వెట్టిచాకిరీ

- ఉమ్మడి జిల్లాలోని మార్కెటింగ్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- కొనసాగింపునకు జారీ కాని ఉత్తర్వులు
- నిధులు విడుదలైనా.. డీటీవో అభ్యంతరాలు


మహబూబ్‌నగర్ ఏడీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మార్కెటింగ్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన ఉద్యోగులకు కొనసాగింపుగా ఉత్తర్వులు జారీ కాలేదు. దీంతో ఏడు నెలలుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌లలో వెట్టిచాకిరి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్టు పద్ధతిలో 123 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో తమ విధులను అలాగే కొనసాగిస్తున్నారు.

రెన్యూవల్ కోసం ఎదురుచూపులు

మార్కెట్‌లోని లావాదేవీలను అనుసరించి కాంట్రాక్టు ఉద్యోగులను నియమించేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆ ఉత్తర్వులలో కాంట్రాక్టు ఉద్యోగులను ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేయాలన్న నిబంధన ఉంది. దీంతో ప్రస్తుత 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ కాలేదు. మార్కెటింగ్ శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలంటూ నిధులను విడుదల చేసి, ఉత్తర్వులను జారీ అయ్యాయి. కానీ ఫైనాన్స్‌శాఖ నుంచి జీవో రాలేని కారణంగా వేతనాలను ఉద్యోగుల ఖాతాలో జమ చేయలేమంటూ జిల్లా ట్రెజరీ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు

డాటా ఎంట్రీ ఆపరేటర్లు 26, ఆఫీస్ సబార్డినేటర్లు 7, సెక్యూరిటీ గార్డులు 85 మంది, వీరితో పాటు జిల్లా మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఒక్కొక్కరు చొప్పున కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

మార్కెటింగ్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు అందించే అంశంపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఏప్రిల్ నెల నుంచి వేతనాలు చెల్లించలేదు. వేతనాలు ఇవ్వాలంటూ తమ దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగులు తీసుకొచ్చారు.

\- బాలమణి, ఏడీఎం

ఇంటర్వ్యూ..

సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలి

- రమేష్, మండల వ్యవసాయాధికారి



ఉప్పునుంతల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి కొర్ర రమేష్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నారా ?

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు ఎఫ్‌పీవో ద్వారా మంగళవారం నుంచి పంపిణీ చేస్తున్నాం.ఎఫ్‌పీవోలో రైతుకు సభ్యత్వం ఉండాలి.

ఇప్పుడు వేరుశనగ విత్తనాలు వేసుకోవడానికి వాతావరణం అనుకూలమేనా?

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూములు జాలువారుతున్న నేపథ్యంలో ప్రస్తుతం వేరుశనగ విత్తనాలు విత్తవద్దని రైతులకు సూచిస్తున్నాం.

వేరుశనగ విత్తనాలు వేస్తే కలుపు నివారణ చర్యలు ఎప్పుడు చేపట్టాలి ?

వేరుశనగ విత్తనాలు విత్తిన 24 గంటల లోపు, అదే విధంగా 21రోజుల తరువాత పంటపై కలుపు నివారణకు మందులు పిచికారి చేసుకోవచ్చు.

రైతులకు సరిపడా యూరియా ఉందా, నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్నారా?

రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు మండలానికి 14,800 బస్తాలు వచ్చాయి. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పత్తి కొనుగోలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు?

త్వరలోనే పత్తి కొనుగోలు చేస్తాం. రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అమ్మకాలు చేసి నష్టపోవద్దు.

న్యూస్ బాక్స్

పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- బీజేపీ నాయకుడు బాలాజీ

ఉప్పునుంతల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ సీనియర్ నాయకుడు మండికారి బాలాజీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గురువారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, చంద్రు, అంజి, శేఖర్ ఉన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ నాయకుడు గణేశ్‌రావు

వెల్దండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో పతనం తప్పదని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు అన్నారు. గురువారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ 22 నెలల పాలనలో ప్రచార ఆర్భాటమే తప్పా ప్రగతి శూన్యమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మండలంలో బీఆర్ఎస్ అధిక స్థానాలను గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రావు, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, దేవా, సురేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ అనురాధకు జడ్పీటీసీ టికెట్ కేటాయించాలి

- సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అజీమ్



మాట్లాడుతున్న సోషల్ మీడియా నియోజకవర్గ కో ఆర్డినేటర్ అజీమ్

అమ్రాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలిచిన మాజీ జడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధకు అధిష్ఠానం ఆలోచించి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ జడ్పీటీసీ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ సోషల్ మీడియా నియోజకవర్గ కో ఆర్డినేటర్ మహమ్మద్ అజీమ్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన అమ్రాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ హయాంలోనూ డాక్టర్ అనురాధ 2013, 2018 సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ తరపున అమ్రాబాద్ జడ్పీటీసీ పోటీ చేసి విజయం సాధించారని ఆయన అన్నారు. ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు లడ్డుయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివ ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్సీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా జిల్లా కేంద్రంలోని ఎస్సీ- సీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, పేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ, తరుణ్, సాయి, గణేష్, నాని, అనిల్, భానుతేజ్ పాల్గొన్నారు.

అంధకారంలో ఆర్టీసీ బస్టాండ్

- పర్యవేక్షణ లేక రాత్రివేళ మద్యం ప్రియులకు అడ్డాగా మారిన అమ్రాబాద్ బస్టాండ్

- కనీస వసతులు కల్పించాలని ప్రయాణికుల విజ్ఞప్తి



విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారంగా మారిన అమ్రాబాద్ బస్టాండ్

అమ్రాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం నెలకొంది. కనీస వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉండడంతో రాత్రివేళ మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. అమ్రాబాద్‌లో దాతల ద్వారా ఎకరం పొలం ఆర్టీసీకి ఇవ్వడంతో 1998 సంవత్సరంలో రూ.15లక్షలతో ఈ బస్టాండ్‌ను ప్రభుత్వం నిర్మించింది. బస్టాండ్ నిర్మించిన కొంతకాలం మాత్రమే బస్సులు బస్టాండ్ లోపలికి వచ్చేవి. ప్రైవేట్ ఆపరేటర్ల పోటీకి బస్సులను రోడ్లపైనే ఆపడంతో బస్టాండ్‌లోకి ప్రయాణికులు క్రమంగా తగ్గిపోయారు. బస్టాండ్‌ను పర్యవేక్షించడానికి 20 సంవత్సరాల క్రితం ఒక ప్రైవేట్ వ్యక్తిని నియమించారు. అతనికి కూడా కొన్నేళ్లుగా వేతనం కూడా ఆర్టీసీ అధికారులు ఇవ్వకపోవడంతో ఆయన వెళ్లిపోయాడు. ప్రస్తుతం అక్కడ ఎవరూ ఉండకపోవడంతో బస్టాండ్ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో ఒక తాగునీటి బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసినప్పటికీ కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం మూలంగా ఆ మోటారు పని చేయడం లేదు. ప్రయాణికులకు టాయిలెట్స్‌లో నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారు.

రోడ్డు విస్తరణతో...

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చొరవతో అమ్రాబాద్‌లో రోడ్డు విస్తరణ పనులు మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. బస్టాండ్‌లోనే బస్సులను నిలిపేలా సంబంధిత ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో ఈ బస్టాండ్‌కు పూర్వ వైభవం వచ్చిందని చెప్పవచ్చు. ప్రస్తుతం ప్రధాన రహదారి వైపున ప్రైవేట్ వ్యక్తులకు ఆర్టీసీ అధికారులు బస్టాండ్ స్థలం లీజుకు ఇవ్వ డంతో ఆ వ్యక్తులు అక్కడ తాత్కాలికంగా షాపు లను ఏర్పాటు చేసుకున్నారు. బస్టాండ్ ఆవరణ లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పాటు కనీస వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణకు మండల కేంద్రానికి చెందిన పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్టాండ్‌లో సదుపాయాలు కల్పించాలి



ఇటీవల కాలంలో అమ్రాబాద్ బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించడంతో ప్రయాణి కుల సంఖ్య పెరిగింది. తాగు నీటి సౌకర్యంతో పాటు ఇతర మౌలిక సదు పాయాలు కల్పించే విధంగా ఆర్టీసీ ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలి.

- వెంకటేశ్, అమ్రాబాద్

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

అమ్రాబాద్ బస్టాండ్‌లో విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ విషయంలో స్థానిక విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరిస్తా. అదేవిధంగా బస్టాండ్ పరిసరాల శుభ్రత, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు సౌకర్యార్థం బస్టాండ్‌ను తీర్చిదిద్దుతాం.

- దుర్గాప్రసాద్, ఆర్టీసీ డీఎం అచ్చంపేట

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్



పాలెంలోని ఎస్వీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కె. రవికుమార్

బిజినేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచే ప్రతీ ఒక్కరు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కాపాడుకోవడం ముఖ్యమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ అన్నారు. మండలంలోని పాలెంలోని ఎస్వీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ మానసిక వారోత్సవం పురస్కరించుకొని నేషనల్ టోబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై వాటి దుష్ప్రభావాల వల్ల విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు నిత్యం యోగా, ధ్యానం చేయడం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సైక్రియాటిస్ట్ డాక్టర్ అంబుజ, పాలెం పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్ స్వామి, రాజగోపాలాచారి, ఏపీవో విజయ్‌కుమార్, బాదం రాజేష్, మల్లేష్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం గజవర్ధనమ్మ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కళ్ల ఆరోగ్యం ప్రతీ ఒక్కరి బాధ్యత :

కందనూలు (ఆంధ్రజ్యోతి) : కళ్ల ఆరోగ్యం ప్రతీ ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెం కటదాస్ అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కళ్లు మనకు ప్రపంచాన్ని చూపించే అమూల్యమైన వరమని, కళ్ల ఆరోగ్యం కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, సీహెచ్‌వో వైశ్రీనివాసులు, నేత్రాధికారి బాలాజీ, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, లేప్రెసి అధికారి సుకుమార్, వైద్య సిబ్బంది కల్యాణ్, కేశవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దయ్యే వరకు ఉద్యమించాలి

- టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బృంగి కృష్ణప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు బృంగి కృష్ణ ప్రసాద్

కొల్లాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దు అయ్యేంత వరకు ఉద్యోగులంతా ఉద్యమించాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బృంగి కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో ఎంతో కృషి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే యువ ఉద్యోగుల పట్ల సీపీఎస్ విధానం తెచ్చి వారి జీవితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చీకటిమయం చేశాయని మండిపడ్డారు. ఏ టెస్టు లేకుండా ఏ టాలెంట్ లేకున్నా ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా ఒక్కసారి పదవులు అనుభవిస్తే వారికి మాత్రం లక్షల్లో పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్య తరగతి ఉద్యోగుల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు పరచాలని లేని యెడల ప్రభుత్వ ఉద్యోగులంతా పోరుబాట పట్టక తప్పదని బృంగి కృష్ణప్రసాద్ హెచ్చరించారు.

ఎస్సీ గురుకుల పార్ట్‌టైం ఉద్యోగులపై నిర్లక్ష్యం వీడాలి

- ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్

అచ్చంపేటటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ గురుకుల పాఠశాలల్లో పనిచేసే పార్ట్‌టైం ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్ అన్నారు. పార్ట్‌టైం ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదని గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న సుమారు ఏడు వేల మంది పార్ట్‌టైం ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, రాజు, శ్రీనాథ్, అంజి, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ : ఏపీవో

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో బృంగి వెంకటేశ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2024, ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనుల్లో రూ.5కోట్ల 84లక్షల 68వేల 357లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.4కోట్ల 21లక్షల 10వేల 889 రూపాయలు కూలీలకు వేతనం రూపంలో ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తారని ఏపీవో తెలిపారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవాటు చేసుకోవాలి : ఎంఈవో

అచ్చంపేటటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవాటు చేసుకోవాలని ఎంఈవో జీవన్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సేవా పథకం శీతాకాల శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి నుంచే ఎన్ఎస్ఎస్ ద్వారా సేవ కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ గర్భిణికి మాతృ సంరక్షణ సేవలు తప్పనిసరి

బిజినేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ గర్భిణికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మాతృ సంరక్షణ వైద్య సేవలు తప్పనిసరి అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి. ప్రసన్న ఆదేశించారు. మండలంలోని లట్టుపల్లిలోని పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం ద్వారా మాతా శిశు మరణాలను అరికట్టేందుకు మాతృ సంరక్షణ సేవలను క్షేత్రస్థాయిలో గర్భిణులకు వైద్య సేవలు అందించాలని ఆరోగ్యకార్యకర్తలను, ఆశాకార్యకర్తలకు సూచించారు.

చేగువేరా జీవితం యువతకు ఆదర్శం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్



చేగువేరా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందనూలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ విప్లవ యోధుడు కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చేగువేరా నేటి సమాజంలోని యువతకు ఎంతో ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో చేగువేరా వర్ధంతిని పురస్కరించుకొని చేగువేరా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంతరాలు లేని సమాజం సరిహద్దులు లేని ప్రపంచం కోరుకున్న ప్రపంచ ప్రేమికుడు చేగువేరా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు తుమ్మల శివుడు, కృష్ణాజీ, గోపిచారి, సీపీఐ నాయకులు వెంకటస్వామి, జంగం శివుడు, సంగమోని కృష్ణకుమార్, బంగారయ్య, విజయ్, రాములు పాల్గొన్నారు.

చేగువేరా నేటి యువతకు స్ఫూర్తి : డీవైఎఫ్ఐ

నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో చేగువేరా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, నాయకులు చంద్రమౌళి, సుల్తాన్, వెంకటేష్, కృష్ణ, రాంచంద్రయ్య, నాగరాజు, మస్తాన్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి : సీఐటీయూ



నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ చెల్లించాలని, గతంలో నాలుగు రోజులు నిరవధిక సమ్మె చేస్తే అప్పటి కమిషనర్ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో మాట్లాడి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారని గుర్తు చేశారు. అందులో భాగంగా కార్మికులకు సేఫ్టీ పరికరాలు, బూట్లు, బ్లౌజులు, పనిముట్లు ఇవ్వాలని అధికారులను కోరనన్నారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, వెంకటేష్, భీముడు, రాములు, బాలస్వామి, కృష్ణయ్య, కురుమయ్య, నరసింహ, ఆంజనేయులు, సంధ్య, సుధాకర్, లక్ష్మి, పార్వతి, కృష్ణవేణి, ఎల్లమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ఉప్పునుంతల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసంపై బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా అవగాహన కల్పించారు. పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సైదా, అంగన్‌వాడీలు ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉద్యోగ అవకాశాలు

- కల్వకుర్తిలో ఏటీసీని పరిశీలించిన కలెక్టర్



ఏటీసీని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం సందర్శించారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు గ్రామీణ ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేస్తున్నాయని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ, కల్వకుర్తి తహసీ ల్దార్ ఇబ్రహీం, ఏటీసీ కోఆర్డినేటర్, ఫ్యాకల్టీ స భ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

వెల్దండ (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలం టూ అధికారులకు సూచించారు. మొత్తం 360 దరఖాస్తులకు గాను 110 పరిష్కారం చేశారని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తిక్ కుమార్, డీటీ కిరణ్ కుమార్ ఉన్నారు.

సీజేఐపై దాడిని ఖండించిన పీజీ కళాశాల విద్యార్థులు



నిరసన తెలుపుతున్న పీజీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

కొల్లాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయం అనుబంధమైన కొల్లాపూర్‌లోని పీజీ సెంటర్ ముందు విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ మాట్లాడుతూ భారత దేశంలోని అత్యున్నత న్యాయస్థానంలో న్యాయ మూర్తికి ఉన్న బీఆర్ గవాయిపై దాడికి పాల్పడ్డ వ్యక్తులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ సురేందర్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ బాబు తేజావత్ దేవరాజ్,అర్జున్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

సమన్వయంగా పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయంగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని నేరెళ్లపల్లి ఆయన స్వగృహంలో గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక విషయమై ఆయా గ్రామాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కారు గుర్తుకు ఓటు వేయించాల న్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగుప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు వేణుగో పాల్‌గౌడ్, గుండు గుండువలమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కల్వకుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కల్వకుర్తి డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. పర్వతాలు మాట్లాడుతూ పార్టీ శాఖ ఉన్న ప్రతీ గ్రామం నుంచి స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లు, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆంజనేయులు, పరశురాములు పాల్గొన్నారు.

చేగువేరా గొప్ప మార్క్సిస్టు మేధావి

చేగువేరా వర్ధంతిని కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు, పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. చేగువేరా ఆశయాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకార్పాముల గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బుడగ జంగాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నిడిగొండ కృష్ణ కోరారు. గురువారం పెద్దకొత్తపల్లిలో బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పెద్దకార్పాముల గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం కేటాయించిన 16ఎకరాల 30గుంటల సీలింగ్ భూమిపై వివాదం తలెత్తిందని పేర్కొన్నారు. దళితులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తుండగా కొందరు బీసీ కులానికి చెందిన వ్యక్తులు పెత్తనం చేలాయిస్తూ దౌర్జన్యంగా భూమిని దున్నడం ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు. బాధిత దళితులు కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందినా తిరిగి కొందరు భూమిని చదును చేస్తున్నారని అన్నారు. గత సోమవారం భూమిలో గడ్డి మందు పిచికారి చేస్తుండగా కొందరు వ్యక్తులు ద్వేషంతో విచక్షణారహితంగా బుడగ జంగం నిడిగొండ సిద్దార్థ, పడాల మహేష్, మరో ఇద్దరిపై మారణాయుధాలతో దాడికి పా ల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పెద్దకొ త్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు చేయాలని వారు పోలీస్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మల్లికార్జున, సంఘం మండల అధ్యక్షుడు గడ్డం సుభాష్, గడ్డం కుమార్, పడాల మహేష్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు కొల్లాపూర్ విద్యార్థులు



తైక్వాండోలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ భాస్కర్ యాదవ్

కొల్లాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలలో కొల్లాపూర్‌లో తైక్వాండో కింగ్స్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు బంగారు పతకం సాధించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున విద్యార్థులు పాల్గొని అండర్ 14, 23 కేజీల విభాగంలో విద్యార్థి పాండు పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడని, అదే విధంగా గౌతం అండర్ 14, 38 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడని కోచ్ భాస్కర్ యాదవ్ పేర్కొన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు 10 నుంచి 12 తేదీలలో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలలో ఉమ్మడి జిల్లా తరఫున పోటీ పడనున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ శ్రీహరి, నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రటరీ శేఖర్, మాస్టర్ శరబందరాజ్, కోచ్ భాస్కర్ యాదవ్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.